క్లుప్తంగా

హుజూరాబాద్ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా సదాశివ


బాధ్యతలు స్వీకరిస్తున్న సదాశివ

హుజూరాబాద్: హుజూరాబాద్ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా సదాశివ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూముల క్రయ విక్రయాల్లో ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్లు జరుగుతాయని, ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు.

ట్రాక్టర్, జేసీబీ డ్రైవర్లను బైండోవర్ చేయండి


మాట్లాడుతున్న తహసీల్దార్ అనుపమ

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన జేసీబీ, ట్రాక్టర్ డ్రైవర్లను బైండోవర్ చేయాలని తహసీల్దార్ అనుపమ గురువారం పోలీసులను ఆదేశించారు. గ్రామంలోని పట్టాభూమిలో అనుమతి లేకుండా తవ్వకాలు చేపట్టి మట్టిని తరలిస్తున్నారని పలువురు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్, ఎంపీడీఓ శ్రీవాణి విచారణ చేపట్టారు. అనంతరం రెండు రోజుల్లో బైండోవర్ చేయాలని ఆదేశాలు జారీచేశారు.

వైద్యుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు


వైద్యాధికారికి ఫిర్యాదు చేస్తున్న రవి

జమ్మికుంట: పట్టణంలోని మమత ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంపై కలెక్టర్, జిల్లా వైద్యాధికారి సుజాతకు బాధితుడు రచ్చ రవికృష్ణ గురువారం ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన లావణ్యను ప్రెగ్నెన్సీతో పాటు థైరాయిడ్, ఇతర వైద్య పరీక్షలకు తీసుకెళ్లగా శాంపిల్స్ తీసుకొని రిపోర్టులు ఇవ్వకుండా రోజులుగా తిప్పుకుంటున్నారని, ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తున్నారని, మళ్లీ శాంపిల్స్ ఇవ్వాలని అంటున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో రోగాలు దూరం

హుజూరాబాద్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని గురువారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రి ఆవరణలో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంటి పరిసరాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భోజనానికి ముందు తర్వాత తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. శుభ్రమైన ఆహార పదార్థాలు, నీటిని తీసుకోవడం ద్వారా వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

జమ్మికుంట: పట్టణంలో ఇద్దరు యువకుల నుంచి 210 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రవి గురువారం తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన యువకులను సోదా చేయగా గంజాయి లభించిందన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవి తెలిపారు.

కాంగ్రెస్‌కు మూడో స్థానమే

చొప్పదండి: కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే మోరీలో వేసినట్టేనని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ది మూడో స్థానమేనని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతుగా గురువారం ప్రచారం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి చేసే వినోద్‌కుమార్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమాలలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఇప్పనపల్లి సాంబయ్య, ఆరెళ్ళి చంద్రశేఖర్‌గౌడ్, కొత్త గంగరెడ్డి, డాక్టర్ అమిత్, భూపతిరెడ్డి పాల్గొన్నారు.

కోతకు వచ్చిన వరి దగ్ధం

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి రైతు జలపతికి చెందిన మూడెకరాల్లోని వరి గురువారం సాయంత్రం దగ్ధమైందని గ్రామస్తులు తెలిపారు. కోతకు వచ్చిన వరి పొలంలో గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ తాగి పడేయడంతో పంట కాలి బూడిదైందని ఫైర్ ఇంజిన్ వచ్చి చుట్టుపక్కల పొలాలకు మంటలు వ్యాపించకుండా అదుపు చేయడంతో భారీ ప్రమాదం తప్పిందని, రైతుకు రూ. రెండు లక్షల మేర నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కంప్యూటర్ విద్యకు సై

- కనీస పరిజ్ఞానం తప్పనిసరి
- ఉపాధి మార్గాలకు కీలకం
- వేసవి సెలవుల్లో శిక్షణ తీసుకునేందుకు యువత ఆసక్తి


కంప్యూటర్ నేర్చుకుంటున్న విద్యార్థినులు

వీణవంక: ఎంత ఉన్నత చదువులు చదివినా, ఎన్ని డిగ్రీలు ఉన్నా కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా మారింది. కంప్యూటర్‌పై అవగాహన లేనిదే ఏ సంస్థలో ఉద్యోగం ఇవ్వని పరిస్థితి నెలకొంది. సాంకేతిక విద్యపై అవగాహన లేకపోతే సాధారణ విద్య పరిజ్ఞానంలో ఇబ్బందికరంగా మారింది. దీంతో యువత విద్యాభ్యాసంతో పాటు కంప్యూటర్ విద్యను నేర్చుకునేందుకు వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండకుండా కంప్యూటర్ కోచింగ్ తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో జమ్మికుంట, హుజూరాబాద్, కరీంనగర్ వంటి ప్రాంతాల్లో కంప్యూటర్ కోచింగ్ సెంటర్లు ఉండగా కనీస విషయ పరిజ్ఞానం నేర్చుకునేందుకు విద్యార్థులతో పాటు యువత, మహిళలు సుముఖత చూపుతున్నారు. వీణవంకలో విజన్ 2020పేరుతో పాడి ఉదయానందన్‌రెడ్డి ఉచిత కంప్యూటర్ కోచింగ్ సెంటర్‌ను నెలకొల్పారు. ఉచితంగా శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. కొన్ని ప్రభుత్వ పాఠశాల్లో సైతం ఆరోతరగతి నుంచే కంప్యూటర్ తరగతులు నిర్వహిస్తున్నారు.

మోడల్ స్కూల్ ఆదర్శం...

మండలంలో ఘన్ముక్కుల మోడల్ స్కూల్లో ఆరో తరగతి నుంచే కంప్యూటర్ క్లాసులు నిర్వహిస్తున్నారు. దాతల సహాయంతో కంప్యూటర్లు సమకూర్చుకొని విద్యార్థులకు నేర్పిస్తున్నారు. ప్రతి తరగతికి గంట పాటు బోధిస్తున్నారు. అదేవిధంగా బేతిగల్ గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ చొప్పరి తిరుపతి సహాయంతో కొన్ని కంప్యూటర్లను పాఠశాలకు ఉచితంగా అందించారు. దీంతో ఇక్కడ విద్యార్థులు కంప్యూటర్ వైపు దృష్టి పెట్టారు. కొన్ని ప్రైమరీ స్కూళ్లలో సైతం దాతల ద్వారా కంప్యూటర్లు సమకూర్చారు. విద్యార్థులు కూడా కంప్యూటర్ నేర్చుకోవడానికి ఆసక్తి కనబర్చుతున్నారు.

ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

యువత కంప్యూటర్ విద్య వైపు ఎక్కువ దృష్టి సాధిస్తున్నారు. ఏదైనా సంస్థలో ఉద్యోగం చేయాలంటే కనీస పరిజ్ఞానం తప్పనిసరి కావడంతో ఎంఎస్ ఆఫీస్, పీజీడీసీఏ, డాటా ఎంట్రీ, ఫొటోషాప్, కోరల్‌డ్రా, సీ లాంగ్వేజ్, సీ ప్లస్‌ప్లస్, ట్యాలీ, నెట్‌వర్కింగ్ గేమ్స్‌తో పాటు ఇతర అంశాలను నేర్చుకుంటున్నారు. అయితే గుర్తింపు పొందిన సంస్థలో కంప్యూటర్ విద్య నేర్చుకుంటే వారు ఇచ్చిన సర్టిఫికెట్ ఉద్యోగాలకు ఉపయోగపడుతుంది. వీణవంకలో యాప్ టీవీ చైర్మన్ పాడి ఉదయానందన్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు, యువతకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నారు. యువత ఇక్కడకు వచ్చి నేర్చుకుంటున్నారు.

కనీస పరిజ్ఞానం అవసరం



కంప్యూటర్ పరిజ్ఞానం ఉంటేనే ఈ రోజుల్లో ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. సాధారణ విద్యతో పాటు సాంకేతిక విద్య వైపు దృష్టి సారించాలి. వేసవి సెలవులను వృథా చేసుకోకుండా కంప్యూటర్ నేర్చుకోవాలి. గుర్తింపు పొందిన సంస్థలో కంప్యూటర్ శిక్షణ పొందితే వారు ఇచ్చే సర్టిఫికెట్ ఏవైనా ఉద్యోగాలకు ఉపయోగపడుతుంది. యువత ఎక్కువగా ప్రధాన పట్టణాలకు వెళ్లి కంప్యూటర్ నేర్చుకుంటున్నారు.

– డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మానకొండూర్/శంకరపట్నం/తిమ్మాపూర్: కాంగ్రెస్‌తోనే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు తరఫున ప్రచారం చేశారు. ఈసందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యానారాయణ, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని, ఆగస్టు 15 వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. రూ.500 గ్యాస్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని, పింఛన్లు రూ.4 వేలకు పెంచుతామన్నారు. వినోద్ కుమార్, బండి సంజయ్ ఎంపీలుగా నుస్తులాపూర్‌కు ఏమైనా చేశారా అని ప్రశ్నించారు. దేవుడి పేరుతో బీజేపీ రాజకీయం చేస్తోందని విమర్శించారు.

కాంగ్రెస్‌లో చేరిన తుమ్మనపల్లి..

బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, నుస్తులాపూర్ మాజీ సర్పంచ్ తుమ్మనపల్లి శ్రీనివాసరావు మంత్రి కాంగ్రెస్‌లో చేరారు. రాజేందర్‌రావు గెలుపునకు కృషి చేయాలని శ్రీనివాసరావుకు సూచించారు.

తలంబ్రాల పేరిట రాజకీయాలు

బీజేపీ ఇంటింటా తలంబ్రాల పేరిట రాజకీయాలు చేస్తుందని మంత్రి ప్రభాకర్ ఆరోపించారు. మానకొండూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ హయాంలో డబుల్ బెడ్‌రూం, దళితులకు మూడెకరాల భూమి ఎందుకు ఇవ్వలేకపోయిందని విమర్శించారు. పేదలందరికి కాంగ్రెస్ ఇళ్లు ఇస్తుందని, ఇచ్చినమాట తప్పదని గుర్తు చేశారు. వడ్డీలేని రుణాలు మంజూరు చేశామని తెలిపారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ ఏం అభివృద్ధి చేశారని మండిపడ్డారు. బీజేపీ అధ్యక్ష పదవి నుంచి ఎందుకు తొలగించారో బండి సంజయ్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించారని, ఎంపీ ఎలక్షన్‌లోకాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మండల అధ్యక్షుడు రవీంద్రచారీ, జిల్లా కార్యదర్శి సంపత్‌గౌడ్, శ్యాసుందర్, చారీ, దేవయ్య, తిరుమల్ రెడ్డి, రామిడి తిరుపతి, గనికంటి సంపత్, పాల్గొన్నారు.

గుడిలో దేవుడు.. గుండెలో భక్తి ఉండాలి

గుడిలో దేవుడు... గుండెలో భక్తి ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శంకరపట్నం మండలంలోని తాడికల్ నుంచి కేశవపట్నం వరకు ర్యాలీ తీసిన అనంతరం కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. శంకరపట్నం మండలానికి తానుచేసిన అభివృద్ధి, వినోద్‌కుమార్, బండి సంజయ్ మంజూరు చేసిన నిధులపై అంబేడ్కర్ చౌరస్తాలో చర్చకు సిద్ధమా అని మంత్రి సవాల్ విసిరారు.

బీజేపీ నాయకుల బైక్ ర్యాలీ


హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న బీజేపీ నాయకులు

హుజూరాబాద్: కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా బండి సంజయ్‌కుమార్ గురువారం నామినేషన్ వేయగా హుజూరాబాద్ నుంచి బీజేపీ శ్రేణులు వంద బైక్‌లపై ర్యాలీగా కరీంనగర్ తరలివెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు, నాయకులు పోతుల సంజీవ్, సంజీవరెడ్డి, లింగంపల్లి శంకర్, రావుల వేణు, వొడ్నాల విజయ్, తూర్పాటి రాజు, అంకటి వాసు, తిప్పబత్తిని రాజు, సబ్బని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: బండి సంజయ్‌కుమార్ నామినేషన్ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు రెండువందల బైక్‌లపై కరీంనగర్‌కు ర్యాలీగా తరలివెళ్లారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు మాట్లాడుతూ... పదేళ్లలో ప్రధాని మోదీ దేశాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లారని, మూడోసారి నరేంద్రమోదీని దేశ ప్రధానిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని, బీజేపీతోనే దేశం అభివృద్ధిబాటలో ముందుకు పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రమణారెడ్డి, ఆరెల్లి శ్రీనివాస్,గురుకుంట్ల సాంబయ్య, శ్రీధర్‌రెడ్డి, మట్ట పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

తూకంలో దళారీ మోసం

హుజూరాబాద్‌రూరల్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారీ తూకంలో మోసం చేసిన సంఘటన మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో చోటు చేసుకుంది. రైతులు తెలిపిన వివరాలు... కొన్నేళ్లుగా రైతుల వద్ద నుంచి ఓ దళారీ ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ సీడ్ ప్లాంట్లకు, రైస్ మిల్లులకు విక్రయిస్తుంటాడు. రెండు ఇరవై కిలోల బాట్లకు రెండు కిలోల బరువు గల వస్తువును వెల్డింగ్ చేయించి కనబడకుండా జాగ్రత్తపడ్డాడు. ఇలాగే కొన్నేండ్లుగా ధాన్యాన్ని కొనుగోలు చేశాడు. ఇదే గ్రామానికి చెందిన తమ్మి కాంతారావు అనే రైతు దళారీకి విక్రయించి కాంట వేసుకొని ట్రాక్టర్లలో ధాన్యం తీసుకొని పోయి వే బ్రిడ్జ్ వద్ద మరోసారి తూకం వేయిస్తే మూడు క్వింటాళ్లు ఎక్కువ వచ్చింది. కాంతరావు ఎలా జరిగిందని ఆరా తీయగా దళారీ మోసం బయటపడింది. దళారీ మోసం గ్రామంలో ఈ నోటా ఆ నోటా దావానంలా వ్యాపించింది. ఈ క్రమంలో రైతులంతా ఏకమై దలారీని పిలిపించి నిలదీశారు. గ్రామంలో ప్రతి పసల్‌కు వంద ట్రాక్టర్లకు పై చిలుకు వెయ్యి క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేస్తాడు. బస్తాకు సంచికి కిలో, మట్టికి కిలో పోను అదనంగా మోసగించిన నాలుగు కిలోలుగాను క్వింటాల్‌కు రైతులు ఆరు కిలోల వరకు ధాన్యం నష్టపోయారు. ఈ విధంగా లక్షలు అర్జించినట్లు తేలిసిపోయింది.

పెద్ద మనుషులతో రాజీ

మోసాన్ని రైతులు నిలదీయండంతో గ్రామానికి చెందిన కొంత మంది పెద్ద మనుషులు గురువారం రాజీ చేసినట్లు తెలిసింది. గ్రామానికి చెందిన పెద్ద మనుషులు ఊరిలోని శివాలయం అభివృద్ధికి రూ. ఐదు లక్షలు చందా రాయాలని తీర్పు చెప్పినట్లు సమాచారం.

'ఏటా రెండు కోట్ల ఉద్యోగాలంటూ మోసం'


మాట్లాడుతున్న కవ్వ లక్ష్మారెడ్డి, నాయకులు

చిగురుమామిడి: కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని మార్చేస్తుందని, ప్రజాస్వామ్య వ్యవస్థకు పెను ప్రమాదం వాటిల్లుతుందని హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ ఇన్‌చార్జి కవ్వ లక్ష్మారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రుల వ్యాఖ్య రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కల్గించేలా ఉన్నాయని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూదేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పి మోసపూరిత విధానాలతో యువత భవిష్యత్‌ను నిర్వీర్యం చేసిందన్నారు. యువకులు, మేధావులు, సమాజాన్ని మార్చే శక్తి కల్గిన మహిళలు బీజేపీ విధానాలపట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈనెల 29న హుస్నాబాద్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సుకు జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. సమావేశంలో జేఏసీ కన్వీనర్లు మేకల వీరన్నయాదవ్, ద్యాగల సారయ్య, జెడ్పీటీసీ గీకురు రవీందర్, జేఏసీ నాయకులు పన్యాల భూపతిరెడ్డి, చీకోటి రమణయ్య, ఇల్లందుల లక్ష్మన్, పొన్నాల ఫ్రాన్సిస్, దోమ తిరుపతిరెడ్డి, గడ్డం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

డీజే ఓనర్‌పై కేసు

రామడుగు: మండల కేంద్రంలో డీజే నిర్వహించిన ఓనర్ సిరికొండ సాయితేజపై కేసు నమోదు చేశామని రామడుగు ఎస్సై సురేందర్ తెలిపారు. వివరాలు ... బుధవారం రాత్రి డీజే సౌండ్స్ ఉపయోగించి పెళ్లి వేడుకలు నిర్వహిస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న సిబ్బంది గుర్తించి విచారణ జరపడంతో అధికారుల అనుమతి లేకుండా నిర్వహిస్తుండడంతో ఆటోతో పాటు సౌండ్ బాక్సులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి గురువారం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. డీజే సౌండ్స్ అనుమతి లేకుండా నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై హెచ్చరించారు.

'బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు ఓట్లడిగే అర్హత లేదు'

కరీంనగర్: బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు బీసీ, ఎస్సీ, ఎస్టీల ఓట్లు అడిగే అర్హత లేదని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ అన్నారు. గురువారం నగరంలో నిర్వహించిన ధర్మ సమాజ్ పార్టీ ఎంపీ అభ్యర్థి చిలువేరు శ్రీకాంత్ నామినేషన్ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ అమలు గురించి అడగడం లేదన్నారు. 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ అమలు గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అణగారిన వర్గాల తరఫున చిలువేరు శ్రీకాంత్‌ను కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో నిలిపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు జంగం సాధన, ప్రధాన కార్యదర్శి తాళ్ల నరేశ్, పరమేశ్వరి, బోయిని సదన్, రాకేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి


పోస్ట్‌కార్డు ద్వారా నిరసన తెలుపుతున్న బండ శ్రీనివాస్, రైతులు

హుజూరాబాద్‌రూరల్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించిందని ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కందుగుల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీటీసీ పడిదం బక్కారెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడలేదని, రైతుల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎనలేని కృషి చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. రుణమాఫీ, రైతుబంధు, మహాలక్ష్మి పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. వందరోజుల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందని, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పోస్టుకార్డు ద్వారా నిరసన వ్యక్తం చేశారు.

టెక్నాలజీ నేర్చుకుంటే అవకాశాలు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరికాంత్

కరీంనగర్ సిటీ: కామర్స్ విద్యార్థులు సబ్జెక్టు నాలెడ్జ్‌తో పాటు సబ్జెక్టుకు సంబంధించిన టెక్నాలజీని నేర్చుకుంటే భవిష్యత్‌లో మంచి అవకాశాలు అందుకోవచ్చని శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ హరికాంత్ అన్నారు. నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో టెక్నాలజీస్ ఫర్ అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్ అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఏ లాంటి కోర్సులు చేస్తే డాక్టర్లు, ఇంజినీర్లు తదితర వారికి సహాయపడవచ్చని తెలిపారు. రీసోర్స్‌పర్సన్‌గా విచ్చేసిన డాక్టర్ వెంకట్రావు టెక్నాలజీని ఏ విధంగా ఉపయోగించాలో శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులు టెక్నాలజీని వినియోగించి మరింత ముందుకు సాగాలని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రాజయ్య మాట్లాడుతూ ఆసక్తితో టెక్నాలజీని నేర్చుకుంటే భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో ఉండడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఎ.సతీశ్‌కుమార్ కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ వర్క్‌షాప్‌లో కామర్స్ అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా హోమం



రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ పరిధి ఔదర్‌పల్లిలో శ్రీ వీరాంజనేయ స్వామి నవగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ, యాగశాల ప్రారంభోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రత్యేకంగా హోమ కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు జగన్నాథం విష్ణువర్ధనాచార్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు వైభవంగా కొనసాగాయి. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న వి. నరేందర్‌రెడ్డి

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడంతో వారిని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి అభినందించారు. ఎంపీసీ విభాగంలో చెట్ల శ్రావ్య 467 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. అల్వాల దీపిక 466 మార్కులు, తూడి శ్రీనివాస్ 466 మార్కులు, గంద్ర రష్మిత, మిట్ట వైష్ణవి, బండ నిక్షిప్తలు 465 మార్కులు సాధించారని చైర్మన్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం బేతి హాసిని 980 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు నమోదు చేసుకుందని, అలాగే బుర్ర సంగీత 976 మార్కులు సాధించినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.


తల్లిదండ్రులతో పింగళి వెన్నెల

ఐఐటీ–జేఈఈ మెయిన్స్‌లో 27వ ర్యాంకు

చిగురుమామిడి: మండలంలోని లంబాడిపల్లి గ్రామానికి చెందిన పింగళి వెన్నెల ఐఐటీ–జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా 27వ ర్యాంకు సాధించింది. పింగళి సుజాత–సంపత్‌రెడ్డి దంపతులకు ఇద్దరు సంతానం. సంపత్‌రెడ్డిది రైతు కుటుంబం కాగా కుమారుడు ప్రశాం ప్రశాంత్‌రెడ్డికి ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. వెన్నెల ఒకటి నుంచి ఐదో తరగతి వరకు స్వగ్రామంలో చదివింది. ఆరు నుంచి పదోతరగతి చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాల, ఇంటర్ తిమ్మాపూర్‌లోని శ్రీచైతన్యలో చదివింది. ఐఐటీ–జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సాధారణ ప్రసవాలు పెంచాలి


డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అజయ్‌కుమార్

హుజూరాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ సూచించారు. గురువారం హుజూరాబాద్‌లోని ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఆర్‌ఎంవో సుధాకర్‌రావును పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్, ల్యాబ్, ఫార్మసీ, లేబర్‌రూం, తదితర విభాగాలను సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య సమస్య లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డయాలసిస్‌కేంద్రంలో 10బెడ్లు ఉన్నాయని, ఇవి రోగులకు సరిపోవడం లేదని, మరో ఐదుబెడ్లు అవసరముందని వైద్యులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ కృష్ణప్రసాద్, వైద్యులు నారాయణరెడ్డి, సోమశేఖర్, శ్రీకాంత్‌రెడ్డి, సురేశ్, అర్చన, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల మద్దతు


కవ్వంపల్లి, వెలిచాలకు కండువాలు కప్పుతున్న చాడ వెంకట్‌రెడ్డి

కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెలిచాల రాజేందర్‌రావు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణలు గురువారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డిభవన్‌కు వచ్చి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డిని, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ మర్రి వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలో కాంగ్రెస్‌తో పాటు సీపీఐ భాగస్వామ్యం ఉన్నందున సీపీఐ రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి సీపీఐ శ్రేణులు పనిచేస్తాయన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో రాజేందర్‌రావుకు సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ గెలుపు కోసం సీపీఐ, కాంగ్రెస్‌లు కృషి చేయాలని తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఏకం కావడం శుభపరిణామం అన్నారు. కాంగెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు మాట్లాడుతూ తనకు సంపూర్ణ మద్దతు ప్రకటించి గెలుపు కోసం పనిచేస్తామని మాట ఇచ్చిన సీపీఐ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, గుంటి వేణు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేదారి, మల్లేశ్, శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు అశోక్, గూడెం లక్ష్మీ, నాయకులు పాల్గొన్నారు.